కాంగ్రెస్‌లోకి చేరికలు



శ్రీగణేశ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన స్థానిక నేతలు

రాంగోపాల్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ మాజీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కట్టెల శ్రీనివాస్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనకు సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. 1994 నుంచి కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేశానని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్టుందన్నారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని, పార్టీలో పనిచేసే వారికి, ఉద్యమకారులకు స్థానం లేకుండా పోయిందని ఆరోపించారు. పార్టీని కమర్షియల్ ట్రాక్‌లోకి తీసుకెళ్లారని విమర్శించారు. తెలంగాణ భవన్ వైపు తొక్కి చూడని వారికి కూడా కార్పొరేషన్ చైర్మన్లకు కట్టబెట్టారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న శ్రీనివాస్‌యాదవ్

కంటోన్మెంట్ : కంటోన్మెంట్ ఐదో వార్డుకు చెందిన విక్కీ, సాయి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని శ్రీగణేశ్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా గెలిస్తే కంటోన్మెంట్‌లో అభివృద్ధి చేస్తానన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం, కేంద్ర ప్రభుత్వ భూముల్లో వెలిసిన బస్తీల్లోని వారికి పట్టాలు ఇప్పిస్తానన్నారు. శంకర్, రాజయ్య, నాగరాజు, శ్రీనాథ్, సంతోష్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం

రసూల్‌పురా: బీఆర్‌ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మాజీ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బుధవారం రాత్రి రాయల్ లీ ప్యాలెస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని షాదీముబారక్, విద్యార్థుల కోసం మైనార్టీల పేరిట గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు, రంజాన్ తోఫాలతో మైనార్టీలకు అండగా నిలిచారని చెప్పారు. రేవంత్ సర్కార్ కేవలం మాటల గారడి తప్పా.. చేసిందేమి లేదని విమర్శించారు. కారు గుర్తుపై ఓటువేసి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ అభ్యర్థి నివేదితలను భారీ మెజార్టీతో గెలిపించాలని మహమూద్ అలీ మైనార్టీలను కోరారు. మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ ఉంటే అందరికి న్యాయం జరుగుతుందన్నారు. ఈసారి ఎన్నికల్లో గులాబీ జెండాను ఆశీర్వదించాలని కోరారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, పాండుయాదవ్, నళిని కిరణ్, లోక్‌నాథ్, మైనార్టీల సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ఇంటింటి ప్రచారం..

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, అన్నానగర్ బస్తీల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్న గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కారుగుర్తుపై ఓటు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి మహమూద్ అలీ

వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కంటోన్మెంట్ ప్రజల మద్దతుతో తనతండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి అనేక అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. తాను కూడా తండ్రి బాటలో నడుస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దని నివేదిత అన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, జంగిలి రాజు, చంద్రకాంత్, నర్సింహ్మా, దేవులపల్లి శ్రీనివాస్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్‌దే గెలుపు..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయమని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. నివేదితకు 25 నుంచి 35 వేల మెజార్టీ ఖాయమని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటోన్మెంట్ ప్రజలంతా సాయన్న కుటుంబసభ్యులేనన్నారు. సాయన్న బిడ్డగా నివేదితకు ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారని, ప్రచారంలో అద్భుత స్పందన వస్తోందని తలసాని తెలిపారు. రాజకీయాలు నివేదితకు కొత్తకాదని, సాయన్న చివరిరోజుల్లో నివేదిత ఆయన వెంటే ఉన్నారని గుర్తుచేశారు. ఏడాదికాలంలో తండ్రిని, చెల్లిని కోల్పోయిన నివేదితకు ప్రజలంతా దీవెనలు అందించాలని తలసాని కోరారు. గెలుపుకోసం ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. కంటోన్మెంట్‌లో ఇతర పార్టీలకు స్థానం లేదన్నారు. కంటోన్మెంట్‌లో మెజార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి బోనస్ అవుతుందన్నారు.

క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికం..

మరోవైపు కేసీఆర్ బస్సుయాత్ర మొదలవ్వగానే ఇతర పార్టీలకు భయం పట్టుకుందని ఎమ్మెల్యే తలసాని అన్నారు. కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికం అన్నారు. ఫేక్ కంప్లైంట్‌లతో అరెస్టులు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి పరిణామాలు జరగబోతున్నాయో చూడాల్సిన అవసరముందన్నారు. మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్నతో పాటు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండుయాదవ్, భాగ్యశ్రీ శ్యామ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి తదితరులు పాల్గొన్నారు.



రసూల్‌పురా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్ బీఆర్‌ఎస్ నేతల ప్రచారం..



రాజరాజేశ్వరినగర్‌లో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



బేగంపేటలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

'గాంధీ'లో మురుగు సమస్యకు పరిష్కారం

• గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎలక్షన్ కమిషన్ • మొదటి దశలో రూ.15 కోట్లతో పనులు





గాంధీఆస్పత్రి : తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో మురుగు సమస్యను పరిష్కరించేందుకు ఎలక్షన్ కమిషన్ (ఈసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి దశలో సుమారు రూ. 15 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు అవసరమైన టెండరు ప్రక్రియను పూర్తి చేసేందుకు తెలంగాణ వైద్యవిద్య మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్‌ఎంఎస్‌ఐడీ) అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రి భవన నిర్మాణ సమయంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రోగుల సంఖ్య పెరగడంతోపాటు నిర్వహణ లోపంతో చిన్నాభిన్నమైంది. ఎనిమిది అంతస్తులు గల ప్రధాన భవనంలోని సెల్లార్ నుంచి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో సమస్య ఉత్పన్నమైంది. దీన్ని ఇంజినీరింగ్ తప్పిదంగా సంబంధిత నిపుణులు తేల్చారు. మురుగు, తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోవడం, సెల్లార్‌లో ఎలుకలు, పందికొక్కులు తవ్వేయడంతో మురుగు బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోయాయి. ఆయా విభాగాలతో పాటు ఆపరేషన్ థియేటర్లలో పైకప్పు నుంచి నీళ్లు కారడంతో సమస్య మరింత తీవ్రమైంది. పలుసార్లు సర్జరీలు నిలిచిపోయాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు జరిగి కోట్లాది రూపాయల విలువైన వైద్యయంత్రాలు కాలి బూడిదయ్యాయి.

మంత్రి కోమటిరెడ్డి చొరవతో...

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించేందుకు గాంధీ మార్చురీకి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆస్పత్రి పరిసరాల్లో పొంగి పొర్లుతున్న మురుగునీటిని గమనించి ఆరా తీశారు. టెండరుదారులు ముందుకు రావడంలేదని తెలుసుకుని ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ప్రతిపాదిత వ్యయం రూ. 19.60 కోట్లకు పెంచారు. దీనికి ప్రభుత్వం ఆమోదించింది. టెండరు ప్రక్రియ ప్రారంభమయ్యేలోపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన వాయిదా పడింది.

గాంధీ పాలనాధికారుల అభ్యర్థన మేరకు..

నానాటికీ డ్రైనేజీ సమస్య తీవ్రం అవుతుందని, త్వరితగతిన టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని గాంధీ పాలనాయంత్రాంగం పలుసార్లు విజ్ఞప్తి చేసింది. టెండరు ప్రక్రియ చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి పొందాలని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు ఉన్నతాధికారులను కోరారు. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు మొదటి దశలో సుమారు రూ. 15 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, అవసరమైన పూర్తి వివరాలు, వీడియోలు, ఫొటోలతో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

టెండరు ప్రక్రియకు ఎన్నికల కమిషన్ ఆమోదం...

గాంధీఆస్పత్రిలో మురుగు సమస్య పరిష్కరించేందుకు అవసరమైన టెండరు ప్రక్రియకు ఎన్నికల కమిషన్ లిఖితపూర్వకంగా ఆమోదం తెలిపింది. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా త్వరితగతిన టెండర్లు పూర్తి చేసి నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. దీనిపై వైద్య ఉన్నతాధికారులు, ఈసీకి కృతజ్ఞతలు తెలిపారు.

పదవీ విరమణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వృక్షశాస్త్రం విభాగంలో 32 ఏళ్ల ల్యాబ్ సూపర్‌వైజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ నరసింహ్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిలుముల సైదులు అధ్యక్షత వహించి కార్యక్రమానికి వృక్షశాస్త్రం విభాగం హెడ్ ప్రొ.రమాదేవి, బీవోఎస్ ప్రొ.సబితరాణి, ప్రొ.కమలాకర్, ప్రొ.నాగేశ్వర్‌రావు, ప్రొ.నిర్మల బాబురావు మాట్లాడారు. అనంతరం నరసింహ్మారెడ్డి, ఆయన సతీమణి సైంటిస్టు వనజలను ఘనంగా సన్మానించారు. అనంతరం డా.నరసింహ్మారెడ్డి, డా. చిలుముల సైదులు(ఓయూ), డా.కరుణాకర్ మనోహర్ రంజేడ్కర్(మహారాష్ట్ర), డా.వీఎస్ రాజు (కేయూ) రచించిన 'వృక్షవర్గీకరణ శాస్త్రం మరియు ఔషధ మొక్కల ఉపయోగం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు.

ఓటు హక్కుపై పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



బౌద్ధనగర్ : ప్రజలు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులు సూచించారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పలు బస్తీల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు స్వతహాగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పార్శిగుట్ట చౌరస్తా నుంచి గంగపుత్రకాలనీ, అశోక్‌నగర్, వైఎస్ఆర్ పార్క్, రాంనగర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్సైలు సుధాకర్, ప్రకాష్‌రెడ్డి, సీఐఎస్ఎఫ్ ఫోర్స్ పాల్గొన్నారు.

'జిజ్ఞాస'లో ప్రభుత్వ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

పరిశోధన ప్రాజెక్టులో ప్రథమస్థానం

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జిజ్ఞాస'లో బేగంపేట ప్రభుత్వ మహిళా కళాశాల కామర్స్ విభాగంలో ప్రథమ బహుమతి లభించింది. కళాశాల కామర్స్, బీబీఏ విద్యార్థినులు రేఖ, అంబిక, సంధ్య, భాను మానస, చాందినీ ప్రియలు 'ది ఇన్‌ఫ్లుయన్స్ ఆఫ్ చాట్ జీపీటీ ఆన్ స్టూడెంట్ లెర్నింగ్ : ఎసెసింగ్ పెర్‌ఫార్మెన్స్, యూజర్ పర్సెప్షన్ అండ్ సాటిస్‌ఫాక్షన్' అనే అంశంపై చేసిన పరిశోధన ప్రాజెక్టుకు మొదటి స్థానం దక్కింది. గురువారం రాజ్‌భవన్‌లోని సంస్కృతి హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ప్రాజెక్టు పర్యవేక్షకులు డాక్టర్ సరితల సమక్షంలో విద్యార్థులు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి, పర్యవేక్షకులు డాక్టర్ సరిత విద్యార్థినులను అభినందించారు.



ప్రశంసాపత్రాలతో బేగంపేట కళాశాల విద్యార్థినులు

యజమాని ఊరెళ్లడంతో..

సామగ్రితో ఉడాయించిన నేపాలీ దంపతులు

రాంగోపాల్‌పేట్: యజమాని కుటుంబం మొత్తం ఊరు వెళ్లడంతో ఓ నేపాలీ దంపతులు ఇంట్లోని విలువైన బంగారు, వెండి తదితర వస్తువులతో ఉడాయించారు.రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 1న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీజీరోడ్డులో ప్రకాష్ రాంకా నివసిస్తూ.. జ్యువెలరీ షాపు నిర్వహిస్తుంటారు. గత రెండు నెలల క్రితం వీరి ఇంట్లో పనిచేసే నేపాలీలు పని వదిలేసి వెళ్లిపోతుంటంతో వారికి తెలిసిన ఇద్దరు దంపతులను పనిలోకి కుదుర్చుకున్నారు. భర్త వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా.. భార్య ఇంట్లో పనిచేస్తుంది. తెలిసిన వారని వారి వివరాలు యజమానులు తీసుకోలేదు. గత నెల 24న కుమారుడు తప్పా కుటుంబ సభ్యులు మొత్తం శుభకార్యానికి ఊరు వెళ్లగా.. రెండు రోజుల క్రితం కుమారుడు సైతం వెళ్లిపోయాడు. ఇదే అదునుగా భావించి గత నెల 30న వంటమనిషికి మద్యం ఇచ్చి మత్తులోకి జారిన తర్వాత ఇంటి తాళాలు పగులగొట్టి 15 తులాల బంగారు ఆభరణాలతో పాటు మరికొన్ని వెండి వస్తువులు, విలువైన వస్తువులతో ఉడాయించారు. ఉదయం వంటమనిషి విషయం యజమానికి చెప్పడంతో వారి కుమార్తె మనీషా రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విలువైన బంగారు ఆభరణాలు లాకర్‌లో ఉన్నాయని యజమాని తెలిపారు. ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు

డిప్యూటీ డీఈఓ శ్రీధర్

బన్సీలాల్‌పేట్: ఎస్‌ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో సికింద్రాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని డిప్యూటీ డీఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ఈసారి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. నిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణ, ఆధునిక విద్యాబోధనతో ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. తమ ఉపాధ్యాయుల నిరంతరం కృషి ఫలితంగా విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా ఈ ఫలితాలు సాధించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలతో మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ఉత్తీర్ణత శాతం తమ బాధ్యతలను మరింత పెంచిందన్నారు. మిశ్రమ ఫలితాలు సాధించిన పాఠశాలలను సమీక్షించి మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

రూ.2.30 లక్షలు స్వాధీనం



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా గురువారం జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్– 02పై నిర్వహించిన తనిఖీల్లో మల్కాజిగిరిలో నివసిస్తున్న ఎవరెడీ బ్యాటరీ ఉద్యోగి హనుమంతరావు నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదు వివరాలు సరిగ్గా చెప్పకపోవడంతోనే స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం జిల్లా గ్రీవియెన్స్ కమిటీ అధికారులకు సిఫారసు చేశారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

బన్సీలాల్‌పేట్: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ నాయకులు, మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల్లో బీజేపీకి సానుకూల వాతావరణం ఉందని ఈ నేపథ్యంలో సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు నరేంద్రమోదీని కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని.. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సుపరిపాలన, సుస్థిర భారత్ కోసం ప్రజలు బీజేపీని గెలిపించాలన్నారు. అరుణ్‌జ్యోతి కాలనీ, రామస్వామి కంపౌండ్, గాంధీనగర్, సీసీనగర్ మీదుగా ప్రచారం నిర్వహించారు. మర్రి పురురవరెడ్డి, రాజశేఖరరెడ్డి, హరినాథ్‌సాయి, సురేష్‌కుమార్, ఆనంద్‌యాదవ్, గిరి, శ్రీనివాస్, అంబాల ఈశ్వర్, శంకర్, సత్యనారాయణ, కిరీటీ, ప్రవీణ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

మాజీ మేయర్ కార్తీకరెడ్డి విస్తృత ప్రచారం..

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థి కిషన్‌రెడ్డిని మరోసారి సికింద్రాబాద్ ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకురాలు, మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం తార్నాక, విజయపురి కాలనీలో ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీ వాసులు, అపార్టుమెంట్ వాసులతో కార్తీకరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. కేంద్రమంత్రి, ఎంపీగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలందరూ బలపరచాలని కోరారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

సనత్‌నగర్: నరేంద్రమోదీ మరోసారి ప్రధాన మంత్రి అయితేనే దేశం అగ్రరాజ్యాల సరసన చేరుతుందని బీజేపీ రాష్ట్ర నేత లింగంపల్లి నర్సింగరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా గురువారం ఆయన సనత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీజేపీ ఎజెండా అన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు.



తార్నాక విజయపురి కాలనీలో మాట్లాడుతున్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి



కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేత నర్సింగరావు

ఓయూ హాస్టల్ మెస్‌లు ఓపెన్!

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హాస్టల్ మెస్‌లు తెరిచే ఉంటాయని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ గురువారం పేర్కొన్నారు. వివిధ ఉద్యోగాల రాత పరీక్షల కారణంగా విద్యార్థుల విజ్ఞప్తి మేరకు హాస్టల్ వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సెలవుల్లో ఇంటికి వెళ్లే విద్యార్థులు లేఖలు రాసి చీఫ్ వార్డెన్, లేడీస్ హాస్టల్ డైరెక్టర్‌కు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో హాస్టల్‌లో లేకున్న మెస్ బిల్లు పడుతుందని స్పష్టం చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ : పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీ కొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్-లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్యసుమారు 50 ఏళ్లున్న వ్యక్తి పట్టాలు దాటే ప్రయత్నం చేస్తుండగా.. వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై తెల్లచొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలకు 8919705664.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ : గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాల పక్కన మృతిచెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి-మల్కాజిగిరి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాల పక్కన ఓ వ్యక్తి మృతి చెందాడన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. మృతుడి వివరాలు లభించలేదు. సుమారు 60 ఏళ్లున్న వ్యక్తి ఒంటిపై నీలిరంగు నిండు చొక్కా, బూడిదరంగు ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 872658586.

Format C-1

(for candidate to publish in Newspaper-TV)

Declaration about Criminal Cases

(As per the Judgement dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and Address of Candidate : **LAXMA REDDY RAGIDI H No. 1-5-9/1, STREET NO 8, GREEN HILLS COLONY, HABSIGUDA, UPPAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT, TELANGANA, PIN CODE 500007**

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI**

Name of Constituency : **07-MALKAJGIRI PARLIAMENTARY CONSTITUENCY**

I, LAXMA REDDY RAGIDI, a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of Case(s)	Section(s) of Acts Concerned and brief description of offence(s)
1	**Hon'ble XVII ACMM, Nampally Hyderabad**	**Not yet Numbered**	**Pending**	**U/s. 324, 323, 504, 427, 506 of IPC Allegations of causing hurt, Provocation, Causing damage and loss, criminal intimidation etc.,**

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment Imposed

Not Applicable

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9912220378

9912220379